# రామజోగి

"అంబ పలుకు జగదాంబ పలుకు, కంచిలున్న కామాక్షీ పలుకు, దేవి పలుకు, దుర్గాంబా పలుకు, మధురల్నున్న మీనాక్షీ పలుకు...."

కరకర పొడుస్తున్న పొద్దుతో బిరబిర నడుస్తూ, పాట పాడుతూ, ఇల్లిల్లూ తిరుగుతున్న చెల్లప్పలో ఆయాసం అంగలేస్తోంది. ఎదలో ఆరని ఆరాటం, తీరని ఆశలు... బోనులో ఎలుకల్లా ఉరకలేస్తున్నాయి. కుడిచేతిలో బుడుబుక్క దమరుకం లయబద్ధంగా శబ్దిస్తోంది. ఇంకా నిద్రాదేవి ఒడి వీడని గ్రామస్థులకు మేల్కొలుపు పాడుతోంది. గుమ్మపాల నురగలాంటి తెల్లని ధోవతి, ఒక దాని మీద ఒకటి నాలుగు జతల పైబట్టలు, గుండ్రని సొరకాయ తలకు గుమ్మడికాయంత తలపాగా, గుబురు మీసాలు, నుదుట విభూతి రేఖల మధ్య ఎర్రని బొట్టు సుప్రభాత సూర్యనిలా మెరిసిపోతోంది. ఎడమ భుజమ్మీద రంగుల గుడ్డ ఇంద్ర ధనుస్సులాగుంది. మెడలో వేలాడుతున్న గంట మోకాళ్ల నడుమ గణ్‌గణ్ మంటోంది.

దినచర్యలో భాగంగా ఓ ఇంటి ముందాగాడు.

"రాజా, మహారాజా! రాజ భోజా!

"రామజోగి పలుకు వినుండ్రయ్యా...." తేట తేనియ పాట తీగలు సాగింది...

"మహారాజా, రాజ, మార్తాండా
రవికల్ప భూజా, రాజసూత్రమా!
మీకు శోభోదయం, మాకు విజయం..."

గడపలో నుంచున్న ఇంటి ఇల్లాలు ఇలవేల్పులా కన్పించింది. ఆవిడ పక్కన పెళ్లికెదిగిన కూతురుంది. ఆసక్తిగా, ఆశగా చూస్తున్నారు.

"తల్లీ జగదాంబ తల్లీ!
శక్రవారము రోజున లచ్చి
సక్కబెట్టుకుని కూచుండాది
కన్నెపడుచు సందమామోలుంది.
చక్కని మొగడొస్తడు,
పువ్వుల్లపెట్టి చేసుకుంటడు
నవ్వుల్లపెట్టి లాలిస్తడు...
ఈ ఇంట్ల సన్నాయి, భజంత్రీలు మోగుతైతల్లీ!..."

కథా నిలయం
శ్రీకాకుళం

ఇంటి ఇల్లాలి మొహం నెమలి ఫించంలా విచ్చుకుంది. వయస్సు పొంగుల్ని చూపులతో తడుముకుంటున్న కన్నెపిల్ల బుగ్గల మీద సిగ్గుల మొగ్గ లేసినై... అరచేతుల్లో మొహం దాచుకుని లోపలికి తుర్రుమంది. రూపాయి బిళ్ల తెచ్చి చెల్లప్ప చేతికిచ్చింది. ఇల్లాలు మురిపాల మూటైపోయింది. ఆకాశానికి దండం బెట్టింది. చాటెడు బియ్యం తెచ్చి జోలెలో పోసింది.



ఐతా చంద్రయ్య

మరో ఇంటి వాకిట్లో..... ముగ్గులు పరుచుకున్నాయి.

"మహారాజా, రాజమార్తాండా!

శుభోదయం మహారాజా!

బుడుబుక్కల రామజోగి ప్రశ్న చెప్తాడు ఇనుకోండ్రి మారాజా!"

సగటు ఇంట్లో అద్దెకుంటున్న సన్నకారు ప్రభుత్వోద్యోగి సర్రున బయటికొచ్చాడు. చేతుల్లో పత్రిక, మధ్యతరగతి మందహాస మది... తనక్కావల్సిందదే....

"మనస్సులన్న మాట చెప్తాడీ రామజోగి. అంబ పలుకు పొల్లుబోనియ్యడు దొరా! మీ మనసు వెన్నముద్ద దొరా!

దొరకు వెంకటేసుడు సాయమైతడు. పట్టిందంతా బంగారమైతది. అయ్యగారి నొసట లక్ష్మీరేఖున్నది హీరో హోండా కొనిపిస్తుంది..."

ఉద్యోగి ధమనుల్లో ఉత్సాహం ఉరకలేసింది. షర్టు జేబులో చెయ్యి. పక్కనున్న పాత బంగళా ముందుకు లాక్కెళ్లాయి కాళ్లు మనులేత కిరణాలు దమరుకం కదలి కళ్లో మెరుస్తున్నాయి. వాయిద్యాని కనుగుణంగా పాట ప్రవహిస్తోంది.

"అంబ పలుకు జగదాంబా పలుకు, కంచిలున్న కామక్షీ పలుకు,

వరహాల బేరాలె మీ రెపుడు సేయాలె, వినరయ్య రామజోగిని నేను, బుడుబుక్కలా రామజోగినీ నేనయ్య...."

"అరేయ్! ఆపు, పాట ఆపెయ్" మెరుపు లేని ఉరుము. బయటేదో అక్రమం జరిగిపోతున్నట్టు.. బంగళాలోంచి పరుగెత్తుకొచ్చిన యువకుని అరుపది. మొహం మారేడు కాయలాగుంది. "కంచి కామాక్షి నీ సంచిలున్నాదిరా? నువు పలుకుమంటే పలుకుతాదిరా?" చేతులు నడుమ్మీదున్నాయి. దమ్ముతన్ను కొస్తోంది.

'వివిధ మనస్తత్వాల సమూహం సమాజం. కొందరి మనసు వెన్నపూసైతే మరికొందరి మనసు కఠిన పాషాణం. రాతి మనసులో మన పాట తేమ పుట్టించొచ్చు"... చిన్నప్పుడు కన్నతండ్రి చెప్పిన మాటలు చెవుల్లో గిగురుమన్నాయి. కాని ఇదేమిటీ....

"కద్దొరా! ఎదో మీ అసోంటి మారాజుల దయాధర్మాల మీద బతుకుతున్నోళ్లం...." మాటతోపాటు దమరుకం స్థాయి కూడా తగ్గింది. చూపులు పక్కనున్న ఎడ్లబండి మీదున్నాయి.

"దయా లేదు, ధర్మం లేదు పో పో....!" కోపంతో యువకిశోరం మొహం కొండముచ్చులాగైంది. ఏదో విధంగా ప్రసన్నం చేసుకొవాలనే ప్రయత్నం చెల్లప్పది.

"మీ ఇంటి ముత్యాల మూటలే మూల్గాలె, రతనాల రాసులే మీ చెంత చేరాలె, రామజోగి పలుకు రతనాల..."

"ఛీ నీయ్వ!" కొండముచ్చుకు పిచ్చెక్కింది. "రోజంతా కష్టపడితే జానెడు పొట్టనిండుతలేదు. ముత్యాల మూటలెట్లా వస్తాయటా! రతనాల రాశులేమన్నా ఆకాశమ్మీంచి రాలి పడ్తయా?" చీదరింపు.

చెల్లప్ప ప్రయత్నం రాజీ పడలేదు.

"మా పగటి వేషాలె మీరెపుడు చూడాలె,
మీమంచి శాలువలు మా మెడకుచుట్టాలే...."

రెట్టించిన ఉత్సాహంతో దరువందుకున్నాడు.

"ఆరేయ్ బుడుబుక్కల నాకొడకా!" యువకునికది కవ్వింపులా తోచిందేమో, గొంతు కీచుమంది. "ఒంటిమీది పుండుకునూనె బొట్టు లేనోడు గొడ్ల కొట్టంల దీపం బెడ్తానన్నట్టు- ఎంగిలి మూతి తుడుచుకునేందుకు తువ్వాల గతి లేదు గాని, మెడకు శాలువనా? పో ఫో... పోతవా లేదా?" ముష్టి యుద్ధానికి దిగాడు. అనువుగాని చోట అధికుల మనరాదు....

"సరే దొరా! అడుక్కుతినేటోనికి ఆరేడిండ్లు...." వెనక్కు తిరిగాడు.

ఇంటి ముందు నుంచుండి ఆదంతా గమనిస్తున్న సాయిరాంలో అసక్తి ఊసులాడింది. అప్పుడే మార్నింగ్ వాక్ నుంచి తిరగొచ్చాడు. జాలేసింది. "పాపం! ముసలి బుడుబుక్కలాయన..." గొణుక్కుంటూ లోపలికెళ్లి సోఫాలో కూలబడ్డాడు. మెదడు పోరల్లో ప్రశాంత సంచలనం.....

దినపత్రిక టీపాయ్ మీదుంది. పక్క నుండి పట్టాగొలుసుల మువ్వల సవ్వడి.. ఏడు నెలల క్రితం తనతో మూడు ముళ్లు వేయించుకున్న లక్ష్మి రాయంచలా వచ్చింది. వేడి చాయ్‌గ్లాసును పత్రిక పక్కన ఉంచుతు మొహంలోకి చూసింది.

ఏదో ఆలోచనలో ఉన్నాడని అర్థమైంది. తిరిగి సాయిరాం మనసు లోలోతుల్ని తడుముకుంటూ కల్లాకపటాల కతీతమైన బాల్యం కళ్లముందు కదుల్తోంది.

ఏడేళ్ల ప్రాయం... పరీక్షకు చదువుకోవాలని ముందే నిద్ర లేపింది అమ్మ. గుడ్డి దీపం వెలుతురులో పట్టుదలగా చదువుతుంటే "సాయిలూ!! ఇయాల్ల నువు నాతో రావా రా!" సూర్యోదయానికి ముందే తయారవుతున్న నాన్న ఆదేశం ఆశనిపాత మైంది.

"నేన్రాను"

"అట్లంటే ఎట్టారా? నువు బుడుబుక్కలోని కొడుకువు. నాలుగూళ్లు తిరిగి నాలుగు పాటలు పాడి నాల్గు పైసలు సంపాదించాలె. నువ్విప్పట్నుంచే నేర్చుకోవాలె" పాగాచుట్టుకుంటున్న నాన్న పగవాడిలా కన్పించాడు.

"నాకొద్దు"

"మరి.... పెద్ద వెరిగినంక ఎట్లా బతుకుతవురా?"

"నేను బడికివోత. చదువుకుంట"

"మూడో తరగతి గదా.... ఇంగ చాలు. కులవృత్తి నేర్చుకో"

కుడితిలో పడ్డ ఎలుకలాగైపోతుంటే తల్లి ముందుకొచ్చి "వాణ్ని గూడ నీవోలె కమ్మంటావా? నావోలె వాని పెండ్లాం ఈతాకుల చాపలల్లాలెనా? రోజుకో ఊరు, పూటకోతిండి. వద్దు..." మందలించింది.

లేకపోతే సిమ్మాసనం మీద కూచోబెట్టి రాజ్యాలేలిస్తవా?" తండ్రి వెటకారం.

"నా కొడుకు బాగా సదుకుంటడు. మంచి నౌరకి జేస్తడు. మనల్ని కూకుండవెట్టి గంజివోస్తడు...." తనను ఒడిలోకి లాక్కుంది. అమ్మ ఒడి ఆనంద నందనవనం...."

"సదూకునుడంటే పోరగాండ్ల ఆటలను కున్నావా? కుల విజ్జతోనే బతుకుదెరు వుంది. నీయవ్వ! వాణ్ని గారం జేస్తున్నవ్.." పాగా పూర్తి జేసి ఒంటికాలు మీద లేచాడు. తల్లిమూతులు తిప్పింది.

"గంగెద్దులెక్క గంతులేస్తే ఎట్లానయ్యా? వాడు హుషారున్నడన్నారు సార్లు. కులంసత్రికటు తెచ్చిస్తివిగదా. ఫీజులు కట్టోద్దటా. ఎంతంటే అంత సదుపు పిరీగ జెప్తరటా....." అంటూ రాత్రంతా వెలిగిన దీపాన్ని ఆర్పేసింది. ఆకాశం... కిటికిలోంచి తెల్లకొండలా కనబడింది. నాన్న కోపం నశాళా నికంటిందేమో.

"ఏయ్.. దొంగముండా!" అమ్మ చెంప ఛెళ్లుమంది. "సదువు గిదువని వాణ్ని నడుమంత్రపోన్ని తయారు జేస్తవా?" మరో చెంప ఛెళ్లు మంది.

తన చిన్నారి మనసు చిదిమేసిన మల్లెపూవైంది. భయం....

"వస్త నాయనా... నీతోనే వస్తా....." తండ్రి కాళ్లను చుట్టేశాడు. తండ్రి చెయ్యి మీసాలు మెలేసింది.

తన ఒంటిమీదున్న నిక్కరు స్థానాన్ని తెల్లపంచె ఆక్రమించింది. చొక్కా మీదికి మరో చొక్కా వచ్చేసింది. పొడగాటి తుండుగుడ్డ తలపాగగా చుట్టుకుంది. నుదట విభూతి రేఖలు, వాటి మధ్య కుంకుమ బొట్టు... కుడిచేతికి దమరుకం... తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేదు.

బలికోసం తయారైన మేకపిల్లలా తండ్రి వెంట కదలక తప్పలేదు. మనసు మారాము ఓమూలన. పక్క ఊరికెళ్తున్నారు. నిద్రలో జోగుతున్న సొంతూరు ఇంకా మేలుకోలేదు. పిల్లబాట తెల్లబడుతోంది.

"బిడ్డా... సాయిలూ!" తండ్రి సముదాయిస్తున్నాడు.

"ఎంత సదూకున్నా కులవిజ్జ మీదికిరాదు. కళ విజ్జలెన్ని నేర్చినా..." కులవిజ్జల సాటి రాదు గువ్వల చెన్నా... అన్నారు. మనకు అన్నం పెట్టేది కులవిజ్జనే....

పిల్లబాటకు పక్క పోలంలో వరికర్రలు భరతనాట్యం నేర్చుకుంటున్న బాలల్లా కదులున్నాయి. మరోపక్క మక్కకర్రల పొడగాటి ఆకులు గాలితో ముచ్చట్లాడుతున్నాయి. నడుమ్మీది పంచె, తలపాగా వదులైపోతున్నై. అవి ఊడిపోతాయేమో... భయం పట్టుకుంది. కాళ్ళర్గి పోయినై. దమరుకాన్ని నేలమీదుంచి సర్దుకోబోతుంటే వెనక నడుస్తున్న తండ్రి.

"ఓర్నియవ్వ!" పెళ్ళున నవ్విండు మొదట్ల గిట్లనే ఉంటది. అలవాటైతే అదే బాగుంటదిరా...." అంటూ సవరించాడు. తిరిగి ఊపిరి పీల్చుకుని నడుస్తున్నారు.

"నీకు 'అంబ పలుకు' వచ్చు గదరా సాయిలూ!"

"జెరంత జెరంత వచ్చు"

"అయితే... నేను పాడినట్టు నువ్వుపాడు."

చల్లని పిల్లగాలి తెర చెంపల్ని నిమిరింది. తండ్రి తిరిగి

"బిడ్డా! మనది అడుక్కుతినే కులం. అందర్నీ పొగడాలె. నల్ల మొగపోణ్ని గూడా నల కుబేరుడనాలె. అష్ట దరిద్రుణ్ని ఆది దేవుడవాలె. ఎవలన్నా తిడితే రోషం రావద్దు. ఉన్నోడు దానం జెయ్యకపోవచ్చు. లేనోడు పుణ్యం కట్టుకోవచ్చు..." ఏదేదో చెప్తున్నాడు తనకవేవీ రుచించడంలేదు.

డమరుకం వాయించటం అంతకుముందే నేర్పాడు కనుక తండ్రి మాటనూ పాటనూ అనుసరించాల్సి వచ్చింది. దొంగబర్రెకు లంకె తగిలించినట్టు పంచె, తలపాగా సతాయిస్తూనే ఉన్నాయి. పక్కూరి పిల్లలు... ఊరి చివర చిర్రాగోనె ఆడుకుంటున్నారు.

"అగో...! బుడ్డ బుడుబెక్కలోడు..." తన వయసు పిల్లలు కేరింతలు కొడ్తున్నారు. వాళ్లంతా గేలి చేస్తున్నట్టనిపించింది.

"అయితే... నీ కొడుక్కు ఇప్పట్నుంచే నేర్పిస్తున్నవా చెల్లప్పా!" ఓ ముసలాయన పళ్లు తోముకుంటూ పలుకరించాడు.

"అవును మల్ల, మొక్కై వంగనిది మొద్దయినంక వంగుతదా దొరా!" కిలుక్కున నవ్వాడు.

తన గుండె గోడలకు మంగముళ్లు గుచ్చుకున్నై.

ఊరు తిరుగుతూనే ఉన్నారు. కాళ్ళు పీక్కుపోతున్నై. ఊరి పెద్దదొర బంగలాముందు తండ్రి చిందులేస్తూ దండకం పాడుతున్నాడు. అయిష్టాన్ని అదిమిపెట్టి, అనుసరించాల్సివచ్చింది. డమరుకం వాయిస్తుండటంతో చెయ్యి నొప్పి పుట్టిస్తోంది...

"ఛీ నీయవ్వ! ఈ పని నాకొద్దు..." మనసు ఎదురు తిరిగింది. దోవతి సర్దుకుంటూ దొరగారు బయటికి రాగానే తండ్రి ఉత్సాహం రెట్టింపైందేమో...

"మహారాజ రాజా! రాజమార్తాండ! మీకు సాటి ఇంకెవరున్నారు ప్రచండా! ఊరు పాలించేటి ఉత్తములు. మీ చేతి కంకణం మాచేత మెరువాలె." దొరగారి కుడిచెయ్యి మీసాలు తిప్పింది. గుమ్మడి పండంత మొహాన్ని గంపెడు చిరునవ్వులు అలుముకున్నై.

ఎండ బలం పుంజుకుంటోంది. ఒళ్లంతా కారం పూసినట్టవుతోంది. పంచె, తలపాగా మా దారి మాదే అంటూ వదులవుతున్నై. తండ్రి "అరే సాయిలూ! బాగా పాడురా. దొరవారి కాళ్లు మొక్కు..." అంటూ భూమ్మీద చెయ్యేసి ముందుకు నెట్టాడు. ఆ ఊపుకు నిలదొక్కుకోలేక పడిపోయాడు. పంచె ఊడి పోయింది. తలపాగా, తుండుగుడ్డ నేలపాలై వెక్కిరిస్తూంది. పసి హృదయంలో పరితాపం.. ఉక్రోశం, రోషం ఉవ్వెత్తున ఎగిసి పడ్డ అలల్లా... పొంగుకొచ్చినై. పిక్కబలం ఒక్క ఉదుటున్న లేపి నుంచోబెట్టింది. ఒంటి మీద షర్టు తప్ప మరేమీ లేదు.. వేటగాని బాణాలకు బెదిరిన లేడిలా పరుగో పరుగు.

"ఆగురా.... సాయిలూ... ఆగురా"! మొత్తుకుంటూ వెంటబడిన తండ్రికి దొరక లేదు. దొరగారి మనుషులు తన నందుకోలే కపోయారు.

స్టేషన్‌లో రైలు కూత కన్నతల్లి పిలుపులా విన్పించింది. అటు రైలెక్కడం, ఇటుటికెట్ కలెక్టర్‌కు దొరికిపోవడం, బాల నేరస్థుల కారాగారంలో పదిహేను రోజులు చదువు సాగడం.. అన్నీ అనూహ్యమే. విడుదల చేస్తామనగానే విపరీతమైన ఆందోళన. జైలరు తన షర్టుతోపాటు వాళ్ళబ్బాయి నిక్కరూ అందిస్తూ...

"సాయిలూ! నీకింకా లోకం పోకడ తెలియదురా. బుద్ధిగా చదువుకుని ప్రయోజకుడివైపో!! ఆప్యాయంగా వీపు నిమిరాడు.

విడుదలైంతర్వాత జన్వారణ్యంలో ఎక్కడి కెళ్ళాలె? ఏల చేయ్యాలె? చిన్న బుర్రలో పెద్ద ప్రశ్నలు.

"సార్! నేనిక్కడనే ఉంటా... సదూకుంటా!" చేతులు జోడించి బతిమాలాడు. జైలర్ మోము మూడు రంగుల జండాలాగైంది.

"ఇదేం విచిత్రంరా! విడుదలయ్యే పిల్లలు అమ్మా నాన్నల్ని కలుసుకోవాలని తొందరపడ్తుంటే నువ్వేమో జైల్లోనే ఉంటాననంటా వెందుకురా?" మాటల్లో మార్దవం.

అంతరంగం లోని అష్టసముద్రం అలలు అతలాకుతలం చేసినై. "నాకెవ్వలూ లేరు సార్!" కళ్లు తడైపోయినై. చేతిలోని లాఠీ జైలరు నుదురుమీద తచ్చాడింది కాస్సేపు.

తనను అనాథ శరణాలయంలో చేర్పిస్తూ,

"ఈ పిల్లగాని పేరు సాయిలు, కాని సాయిరాం అని రాసుకోండి. వీడు బాగా చదువుకుని పైకి రావాలె" మేనేజర్‌కెంతో చెప్పాడు జైలర్. ఆయన పాదాలకు మొక్కేదాకా మనసు కుదుట పడలేదు.

హైస్కూల్ విద్య అనాథశరణాలయం ఒడిలో, ఆ తర్వాత చదువు గవర్నమెంటు హాస్టళ్లలో మిత్రుల సహకారంతో ఇంజినీరింగ్ సూర్తయింది. తిండి, బట్టలు తన నెప్పుడూ బాధించలేదు. వినయ విధేయుతలే శ్రీరామరక్షగా నిలిచి అనుమానాలు, అవమానాలను హారతి కర్పూరంలా కరిగించాయి.

కావాలనుకున్న ఉద్యోగం కాళ్ల ముందు కొచ్చింది. ఎప్పుడూ యోగక్షేమాలు తెలుసుకుంటున్న జైలరు రుణమెలా తీర్చుకోవాలనే ఆరాటం అతడి కూతురు లక్ష్మితో పెళ్లవగానే తీరిపోయింది. ఉద్యోగంలో ఒడిదుడుకులు...

"అరెరే పేపర్ గూడా చూడకుండా ఏమాలోచిస్తున్నట్టూ!" అందెల రవళితో వచ్చి కమ్మగా భుజం తట్టి, తియ్యగా కళ్లలోకి చూసింది లక్ష్మి. గతం కనుమరుగైంది.

కన్నతండ్రి మనసులాగానే లక్ష్మి మనసు వెన్నముద్ద. కనుబొమల మధ్య ఎర్రని బొట్టు ఆత్మతృప్తి నిచ్చింది.

బయట డమరుక వాయిద్యం దగ్గరవుతోంది.

"కూచో లక్ష్మీ!" గాజుల చేతినందుకుని కూచోబెట్టుకున్నాడు. చెంపగిల్లాడు జలపాతం సవ్వడిలా గలగలా నవ్వింది.

"అంబ పలుకు జగదాంబా పలుకు..."

చెల్లప్ప వాకిట్లోకొచ్చాడు. సూర్యకిరణాలు మొహాన్ని మెరిపిస్తున్నాయి. అలసట సతాయిస్తోంది.

"జగఝూం తాళీ పలుకు
మళయాళ భగవతీ పలుకు....."

చెల్లప్ప పలుకులు వినసొంపుగా ఉన్నాయి. సాయిరాం దంపతులు సర్దుక్కూచున్నారు.

"శుక్రవారము లచ్చి ఇచ్చటే కూచుంది. జయము జయము జయము మారాజా...."

డమరుకం మోత, నోటిపాట, చెల్లప్పచిందులు... సాయిరాం వాడి చూపులు అపాదమస్తకం తడుముతున్నాయి. "నువ్వు లోపలికి రావయ్యా!" ఆత్రంగా పిలిచాడు. చెల్లప్ప కళ్లు ఆశాకిరాణాలైనాయి. ఆయాసం ఆవులిస్తోంది.

"వద్దు దొరా! నా స్థానం గిదే!" శక్తినంతా కూడదీసి పాటందుకో భోయాడు. సాయిరాం నరాల్లో వింత స్వరమాధుర్యం... ఉద్వేగం... ఉద్విగ్నం... స్ప్రింగ్‌లా ఎగిరి చెల్లప్ప చెయ్యందుకుని లోపలికి తీసుకొచ్చాడు.

బిత్తరపోయిన చెల్లప్ప సాయిరాంను ఎగాదిగా చూశాడు. మనసులో లీలగా ఏదోరూపం... కదలిక... మెల్లగా విచ్చుకుంటున్న జ్ఞాపకాల పొరలు... ఏదో అస్పష్టత... మళ్లీ లీలగా... ఈసారి ఎదురుగా నిలబడ్డ సాయిరాంతో,

"నువ్వు.. నువ్వు..." తడైన గొంతు జీరబోయింది.

"అవును, నేనే... నీ సాయిలును.. ఇప్పుడు సాయిరాంను... నీ కొడుకును నాయినా" సంతోషానందాలు... ఆమాతం కౌగలించుకున్నాడు.. ఒళ్లంతా పారిన పులకింత.... కన్నపేగు అయస్కాంత శక్తి ఒకరి ఒడిలో ఒకర్ని కరిగిస్తోంది.

"అంతా... బాగున్నారా నాయినా!"

"ఆం... ఆం... కులవిజ్జ... అన్నం బెడ్తుందిరా....!"

**విపుల, జనవరి 2007**

